క్లుప్తంగా

వైద్య సేవలు ప్రజల వద్దకు చేరాలి

డీఎంహెచ్‌వో సుహాసిని



గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తలపెట్టిన కుటుంబ డాక్టర్ వైద్య సేవలు ప్రజల వద్దకు చేరాలని డీఎంహెచ్‌వో ఎం.సుహాసిని అన్నారు. మండలం పరిధిలోని గుంటుపల్లి వెల్‌నెస్ సెంటర్‌ను ఆమె బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వెల్‌నెస్ సెంటర్‌లో రోజువారీ వచ్చే రోగులపై ఆరాతీశారు. రోగులకు అందుతున్న వైద్య సదుపాయాలు పరిశీలించారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం తీరు అడిగి తెలుసుకున్నారు. చిన్నారులు వ్యాధి నిరోధక టీకాల రిజిష్టర్ పరిశీలించి తల్లిపాల వారోత్సవాల అమలు అడిగి తెలుసుకున్నారు. గర్భిణులకు సరఫరా చేస్తున్న వైఎస్సార్ పోషణ అభియాన్ కిట్లు పంపిణీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి

మైలవరం: విద్యార్థులు ఇష్టపడి చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చని ప్రముఖ చార్టర్డ్ ఎకౌంటెంట్ సుంకర అక్కయ్యనాయుడు తెలిపారు. మైలవరం శ్రీలీలావతి గిరిజన పాఠశాలలో 150 మంది విద్యార్థులకు అక్కయ్యనాయుడు సౌజన్యంతో అచ్చు కాపీ పుస్తకాలు బుధవారం అందజేశారు. కాపీ పుస్తకాలు ప్రతి రోజు రాయడం వలన దస్తూరి అభివృద్ధి చెందుతుందన్నారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఉడతా లక్ష్మీనారాయణ, పాఠశాల యాజమాన్యం, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జగనన్న పాల వెల్లువపై అవగాహన

ఏ.కొండూరు: జగనన్న పాల వెల్లువ పాల కేంద్రాల్లో పాలు పోసి పాడి రైతుల సంఖ్య పెంచే విధంగా కృషి చేయాలని తహసీల్దార్ చాట్ల వెంకటేశ్వర్లు తెలిపారు. మండల వెలుగు కార్యాలయంలో బుధవారం వీఓఏలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామాల్లో స్వయం సహాయ సంఘ మహిళలకు జగనన్న పాల వెల్లువపై అవగాహన కల్పించి వారికి పాడి గేదెలు కొనుగోలు చేసుకోవటానికి రుణాలు ఇప్పించాలన్నారు. పాలను ఈ పాల కేంద్రాల్లో పోసే విధంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా ప్రభుత్వం డ్వాక్రా గ్రూపులకు అనేక రకాల రుణాలు అందిస్తుందని పేర్కొన్నారు. ఎంపీడీఓ కేఎస్ఎస్ రవికాంత్, పశువైద్యాధికారి భరత్, వెలుగు ఏపీఎం ఆర్ సత్యం, సీసీలు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

కొమ్మిరెడ్డిపల్లి(తిరువూరురూరల్): మండలంలోని కొమ్మిరెడ్డిపల్లిలో బుధవారం మరణించిన ముష్టికుంట్ల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘ సభ్యురాలు మైసాక్షి లక్ష్మీనరసమ్మ అంత్యక్రియల నిమిత్తం సంఘ చైర్మన్ బండి రవికుమార్ ఆర్థిక సాయం అందజేశారు. సహకార సంఘ బైలా ప్రకారం సభ్యులు మరణించినపుడు రూ.10 వేలను మట్టి ఖర్చుల కింద అందజేసినట్లు రవికుమార్ తెలిపారు. కార్యక్రమంలో కొమ్మిరెడ్డిపల్లి సర్పంచి వెంకటేశ్వర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆయిల్‌పామ్ మెగా మేళా

ఏ.కొండూరు: మండల పరిధిలోని వల్లంపట్ల గ్రామంలో జుపల్లి అయ్యన్న ఆయిల్‌పామ్ తోటలో ఆయిల్ పామ్ మెగామేళా గురువారం ఉదయం నిర్వహిస్తున్నట్లు హార్టికల్చర్ అధికారి బి.నరేంద్ర బుధవారం తెలిపారు. ఈ మెగా మేళాలో అర్హులైన రైతులకు ఆయిల్‌పామ్ మొక్కలు, డ్రిప్, స్ప్రింక్లర్లు పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. ఆయిల్‌పామ్ సాగు చేయాలనుకునే రైతులు ఈ మేళాలో పాల్గొనాలని కోరారు.

ఆస్పత్రికి వెళ్లి పింఛను అందజేత



జి.కొండూరు: పథకాలు కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే రోజులుపోయి ప్రజల వద్దకే పథకాలు వచ్చే అద్భుతమైన గ్రామ వలంటీరు వ్యవస్థను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తోంది. అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న లబ్ధిదారుడుకి వలంటీర్ వెళ్లి పింఛన్‌ను అందించాడు. వెలగలేరు గ్రామానికి చెందిన పారిశుద్ధ్య కార్మికుడు కొవ్వల వెంకటేశ్వరరావు అనారోగ్యంతో గత కొన్ని రోజులుగా విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కాగా ఈ గ్రామానికి చెందిన గ్రామ వలంటీరు సుజన బుధవారం ఉదయం నేరుగా విజయవాడ ప్రభుత్వాస్పత్రికి వెళ్లి వెంకటేశ్వరరావుకి పింఛన్‌ను అందజేసింది. అనారోగ్యంతో ఉన్న తనకి ఆస్పత్రికి వచ్చి పింఛన్‌ను అందించడం పట్ల వెంకటేశ్వరరావు వలంటీరు సుజనకు కృతజ్ఞతలు తెలిపారు. పలువురు వలంటీరును అభినందించారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను
- వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్‌ల పంపిణీ



జగ్గయ్యపేటలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్‌లు అందజేస్తున్న విప్ ఉదయభాను

జగ్గయ్యపేట: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను తెలిపారు. పట్టణంలోని బ్రాహ్మణ బజారులోని అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్‌లను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందజేస్తున్న కిట్‌లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ లక్ష్మీభార్గవి, ఎంపీడీఓ ఎస్‌వీ ప్రసాద్, విమలాభాను ఫౌండేషన్ చైర్‌పర్సన్ సామినేని విమలాభాను, ఎంపీపీ మార్కపూడి గాంధీ, తదితరులు పాల్గొన్నారు. అలాగే చిల్లకల్లు మండల పరిషత్ కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలు కిట్లు పంపిణీ చేసి ర్యాలీ నిర్వహించారు.

పెనుగంచిప్రోలులో..

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్‌లను అందజేయటంతో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి, తహసీల్దార్ కె.లక్ష్మీకల్యాణి, ఎంపీడీఓ ఎస్వీ ప్రసాద్, వైద్యాధికారి పి.ఇందిర, సుజన, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉషారాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే ముండ్లపాడు అంగన్‌వాడీ కేంద్రంలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్‌లను అందజేశారు.

ఆరోగ్యమే లక్ష్యంగా వైఎస్సార్ సంపూర్ణ పోషణ

నందిగామ: గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంగా ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని మండల పరిషత్ అధ్యక్షురాలు అరిగల సుందరమ్మ అన్నారు. ప్రభుత్వం ప్రారంభించిన వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ కార్యక్రమంలో భాగంగా బుధవారం పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో గర్భిణులకు, బాలింతలకు పోషకాహార కిట్‌లను అందజేశారు. ప్రతి నెల బియ్యం, కందిపప్పు, నూనె, కోడిగుడ్లు, పాలు, అటుకులు, రాగి పిండి, బెల్లం, చిక్కి, ఖర్జూర లాంటి పౌష్టికాహారాలను అందజేస్తున్నామన్నారు. సీడీపీఓ భాగ్య రేణుక, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

30 మందికి కిట్‌ల పంపిణీ

కంచికచర్ల: గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు బలవర్ధకమైన పౌష్టికాహారాన్ని ప్రభుత్వం అందజేస్తోందని ఎంపీపీ షేక్ మలక్‌బషీర్ అన్నారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో బుధవారం వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకంలో భాగంగా టేక్ హోం న్యూట్రీషియన్ కిట్‌ను బుధవారం అందజేశారు. ఈ మేరకు ఎంపీపీ మాట్లాడుతూ.. ఒక్కో లబ్ధిదారులకు నెలకు రూ. 1,100లు ప్రభుత్వం ఖర్చు చేస్తోందన్నారు. 30 మందికి కిట్‌లను పంపిణీ చేశారు. సర్పంచ్ వేల్పుల సునీత, ఎంపీటీసీ బర్రె ఉదయ్‌కిరణ్, సూపర్‌వైజర్లు తారాబీ, కరీమాబీ అంగనవాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.



కిట్‌లు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ నాగమణి

వత్సవాయిలో అందజేత

వత్సవాయి: వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను ఐసీడీఎస్ ద్వారా అందిస్తున్నామని ఎంపీడీఓ సీహెచ్ చెన్నారావు తెలిపారు. వత్సవాయిలో జరిగిన కార్యక్రమంలో ఆయన లబ్ధిదారులకు కిట్లను అందించారు. దబ్బాకుపల్లి, మక్కపేట గ్రామాల్లోనూ కిట్లను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు భూక్యా సీతమ్మ, కొట్టె నగేష్, గు డేటి శారమ్మ, సూపర్‌వైజర్లు బీబీజాన్, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.



కంచికచర్లలో కిట్లను అందజేస్తున్న ఎంపీపీ మలక్‌బషీర్, ప్రజాప్రతినిధులు



నందిగామలో కిట్‌లు అందుకున్న గర్భిణులు, బాలింతలు



వత్సవాయిలో కిట్లను అందజేస్తున్న సర్పంచ్ సీతమ్మ

రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి పరుగులు

రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి

జగ్గయ్యపేట: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం పరుగులు పెడుతోందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. పట్టణంలో స్థానిక ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను జన్మదినాన్ని పురస్కరించుకుని బుధవారం వీఎస్‌పీ టౌన్‌హాల్ నందు మణిపాల్ హాస్పటల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా దివ్యాంగులకు మంజూరైన 11 మూడు చక్రాల మోటార్ వెహికల్స్‌ను అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నాలుగేళ్ల పాలనలో జగ్గయ్యపేట నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామన్నారు. కొన్ని సమస్యలను గతంలో పట్టణానికి వచ్చిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామని, ప్యాసింజర్ రైలు ఏర్పాటు కోసం కూడా రైల్వే అధికారులకు సీఎం ద్వారా లేఖ అందించామన్నారు. వీటిపై సీఎం దృష్టికి మరలా తీసుకువెళ్లాలని కోరగా సజ్జల తప్పక తీసుకెళ్తానన్నారు. వైఎస్సార్ సీపీ సర్కిల్ వద్ద మహానేత వైఎస్సార్ విగ్రహానికి, మున్సిపల్ కూడలిలో భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రాజన్న క్యాంటీన్ ఏర్పాటు అభినందనీయం..

జగ్గయ్యపేటఅర్బన్: ఆకలితో బాధపడుతున్న నిరుపేదలను ఆదుకునేందుకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను ఆధ్వర్యంలో రాజన్న ఉచిత భోజన క్యాంటీన్‌ను పట్టణంలో ఏర్పాటుచేయడం ఆదర్శనీయమని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. స్థానిక 30వ వార్డులోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే ఉదయభాను ఆధ్వర్యంలో నిరంతరం కొనసాగే విధంగా ఏర్పాటుచేసిన రాజన్న ఉచిత భోజన క్యాంటీన్‌ను ఉదయభానుతో కలిసి సజ్జల ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ.. వైఎస్సార్ ఆశయాల సాధనలో భాగంగా ఆయన స్ఫూర్తితో ఉచితంగా ఈ రాజన్న క్యాంటీన్‌ను ఏర్పాటుచేశామని, ఇది నిరంతరం కొనసాగుతుందన్నారు. 4 వేల మందికి పైగా తరలి వచ్చి భోజనం చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే మొండితోక జగన్‌మోహన్‌రావు, స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చల్లా మధుసూదనరెడ్డి, నియోజకవర్గ పార్టీ పరిశీలకులు నూతలపాటి హనుమయ్య, మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, ఏఎంసీ చైర్మన్ ముత్తినేని విజయశేఖర్, కేడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, నియోజకవర్గ యువజన నాయకుడు వెంకటకృష్ణప్రసాద్, విమలాభాను ఫౌండేషన్ చైర్‌పర్సన్ సామినేని విమలాభాను, మైనింగ్, పూసల కార్పొరేషన్ డైరెక్టర్లు బత్తుల రామారావు, చేని కుమారి, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్, మున్సిపల్ వైస్ చైర్మన్లు తుమ్మల ప్రభాకర్, షేక్ హఫీజున్నీసా ఫిరోజ్, స్థానిక కౌన్సిలర్ పందుల రోశయ్య, పార్టీ వైద్య విభాగం జోనల్ ఇన్‌చార్జ్ డాక్టర్ మెహబూబ్ షేక్, స్థానిక కౌన్సిలర్లు, పార్టీ వివిధ అనుబంధ విభాగాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



దివ్యాంగులకు స్కూటీలు అందజేస్తున్న ప్రభుత్వ సలహాదారు సజ్జల, విప్ ఉదయభాను, ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

బడుగు వర్గాల అభ్యున్నతే లక్ష్యం

ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

వీరులపాడు: బడుగు వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్ మోహనరావు పేర్కొన్నారు. మండలంలోని అల్లూరు గ్రామంలో వైఎస్సార్ జగనన్న బడుగు వికాసం పథకం ద్వారా మంజూరైన నూతన కార్లను బుధవారం ఆయన లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జగనన్న బడుగు వికాసం ద్వారా ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి రాయితీపై రెండు కార్లు మంజూరయ్యాయన్నారు. ఎస్సీ, ఎస్టీ వర్గాల్లోని పేదలకు బ్యాంకుల ద్వారా రుణాలను మంజూరు చేయటంతో పాటు ప్రభుత్వ పరంగా రాయితీలు అందించి పారిశ్రామిక వేత్తలుగా మార్చటమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న బడుగు వికాసం పథకాన్ని ప్రవేశపెట్టారని చెప్పారు. పథకంలో భాగంగా మండలంలోని బోడవాడకు చెందిన జీవన జ్యోతి స్వయం సహాయక సంఘంలోని కటికల గంగమ్మ, రాజబాబు, జమ్మవరానికి చెందిన జనచైతన్య స్వయం సహాయక సంఘంలోని నందిగామ రత్న వంశీలకు కార్లు అందించామన్నారు. 45 శాతం బ్యాంకు రుణం, 45 శాతం జిల్లా పరిశ్రమల కేంద్రం రాయితీ, 10 శాతం లబ్ధిదారుని వాటాగా నిర్ణయించి ఒక్కొక్కరికి రూ. 9.14 లక్షలను ప్రభుత్వం మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తి సౌజన్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ నువ్వుల విశ్వనాథం, నాయకులు కుంపటి శ్రీను, రాజగోపాల్‌రెడ్డి, వేమూరి ఆదాం తదితరులు పాల్గొన్నారు.



అల్లూరులో కార్లను అందజేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు, ప్రజాప్రతినిధులు

కాజ్ వేకు మరమ్మతులు నిర్వహించాలి

లింగాల(వత్సవాయి): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న మునేటి కాజ్‌వేకు మరమ్మతులు నిర్వహించాలని సీపీఎం మండల కమిటీ కోరింది. దెబ్బతిన్న కాజ్‌వేను బుధవారం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆంధ్రా, తెలంగాణా వెళ్లడానికి ఈ కాజ్‌వే ప్రధానం కావడంతో ప్రయాణికులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కుంటున్నారని తెలిపారు. మునేటిలో ఉన్న రక్షిత మంచినీటి పథకం పైపులైన్లు కూడా తీవ్రంగా దెబ్బతినడంతో పాటు పైపులు వరదకు కొట్టుకుపోయాయన్నారు. దీంతో మండలంలోని కొన్ని గ్రామాలకు మంచినీటి ఇబ్బందులు ఎదురయ్యాయన్నారు. వెంటనే ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి కాజ్‌వేకు మరమ్మతులు నిర్వహించి రాకపోకలను పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

15న చిత్రలేఖన పోటీలు

పటమట(విజయవాడతూర్పు): స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నగరానికి చెందిన అన్నసంతర్పణ సమితి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 15న విద్యార్థులకు చిత్రలేఖ పోటీలను నిర్వహించనున్నట్లు సంస్థ అధ్యక్షుడు గుండు దిలీప్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పోటీలు కస్తూరిబాయ్ పేటలోని నవోదయ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 2–10 వ తరగతి వరకు మూడు విభాగాలుగా చిత్రలేఖన పోటీలు నిర్వహించనున్నామని, చిత్రలేఖన పోటీల్లో పాల్గొనదలచిన విద్యార్థులు ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. పోటీల్లో పాల్గొన్న వారందరికీ సర్టిఫికెట్లు బహుమతులు అందించనున్నామని, వివరాలకు 82475 00651 సంప్రదించాలని కోరారు

ఘనంగా ఉదయభాను జన్మదిన వేడుకలు

జగ్గయ్యపేటఅర్బన్: నియోజకవర్గ వ్యాప్తంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయభాను నివాసంలో పలువురు పార్టీ నేతలతో కలిసి అభిమానులు ఏర్పాటుచేసిన కేక్‌లను కట్ చేశారు. జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల నుంచి పార్టీ శ్రేణులు, నాయకులు, అభిమానులు, వివిధ శాఖల ఉద్యోగులు, బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పుష్పగుచ్ఛాలు, శాలువాలతో ఉదయభానును ఘనంగా సత్కరించారు. పలువురు నోట్ పుస్తకాలను, మొక్కలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. వేలాది మంది కార్యకర్తలతో ఉదయభాను గృహం ఉన్న వీధి కిటకిటలాడగా, పార్టీ యూత్ సభ్యులు పట్టణ వీధుల్లో భారీ బైక్‌ర్యాలీ నిర్వహించి పలు కూడళ్లలో బాణా సంచా కాల్చిసంబరాలు జరుపుకున్నారు. పట్టణ ప్రముఖులు, నాయకులు తరలివచ్చి స్వీట్లు పంచి, కేక్‌లను కట్‌చేసి పలువురికి పంచారు. తనకు శుభాకాంక్షలు తెలిపేందుకు వచ్చిన వారిని పేరు పేరున ఆప్యాయంగా పలకరించి కృతజ్ఞతలు తెలిపారు. గండ్రాయి గ్రామ పార్టీ నాయకులు ఏర్పాటుచేసిన 100 కేజీల కేక్‌ను ఉదయభానుతో కట్ చేయించి శుభాకాంక్షలు చెప్పారు. కార్యక్రమంలో ఉదయభాను సతీమణి విమలాభాను, కుమారుడు సామినేని వెంకటకృష్ణ ప్రసాద్, కేడీసీసీబీ మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, వైస్ చైర్మన్లు తుమ్మల ప్రభాకర్, షేక్ హఫీజున్నీసా ఫిరోజ్, ఏఎంసీ చైర్మన్ ముత్తినేని విజయశేఖర్, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్, పారిశ్రామికవేత్త పారామౌంట్ సురేష్ తదితరులు పాల్గొన్నారు. జిల్లా వైద్యాధికారి సుహాసిని, పార్టీ డాక్టర్స్ సెల్ జోనల్ ఇన్‌చార్జి డాక్టర్ మెహబూబ్ షేక్, ఏసీపీ కె.జనార్దన నాయుడు, వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు, ఎంపీపీలు, సొసైటీల అధ్యక్షులు, సర్పంచ్‌లు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, వార్డుల నెంబర్లు తదితరులు పాల్గొన్నారు. పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కేక్‌ను రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు సజ్జల రామకృష్ణారెడ్డి కట్ చేసి ఉదయభానుకు తినిపించారు. పేట మండలంలోని అన్ని గ్రామాల్లో ఉదయభాను జన్మదిన వేడుకలను పార్టీ శ్రేణులు ఘనంగా జరుపుకున్నారు. గౌరవరం గ్రామంలో పార్టీ నాయకులు ఏర్పాటుచేసిన కేక్‌ను సజ్జల రామకృష్ణారెడ్డి కట్ చేసి పలువురికి పంచారు.



జగ్గయ్యపేటలో భారీ కేక్‌ను కట్ చేస్తున్న ఉదయభాను, నాయకులు



భోజనం వడ్డిస్తున్న వెంకటకృష్ణప్రసాద్, జెడ్పీటీసీ నాగమణి తదితరులు

పేదలకు అన్నదానం..

పెనుగంచిప్రోలు: ఉదయభాను జన్మదినం సందర్భంగా స్థానిక శ్రీతిరుపతమ్మవారి ఆలయం వద్ద బుధవారం పేదలకు యస్‌యూబీ, వూట్ల యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదానాన్ని వైఎస్సార్ సీపీ యువ నాయకులు సామినేని వెంకటకృష్ణప్రసాద్ ప్రారంభించారు. ముందుగా ఆయన గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీతిరుపతమ్మ వారిని దర్శించుకున్నారు. ఎంపీపీ మార్కపూడి గాంధీ, జెడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి, ఆలయ ఈఓ కె.రమేష్‌నాయుడు, చైర్మన్ ఇంజం చెన్నకేశవరావు, పార్టీ మండల అధ్యక్షుడు వూట్ల నాగేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు గింజుపల్లి నరసింహారావు, ఏఎంసీ డైరెక్టర్ తమ్మిశెట్టి సోమయ్య, మండల ట్రేడ్ యూనియన్ నాయకులు దేరంగుల శ్రీనివాసరావు, జెడ్పీటీసీ మాజీ సభ్యులు కాకాని శ్రీనివాసరావు పాల్గొన్నారు. అన్ని గ్రామాల్లో ఉదయభాను జన్మదిన వేడుకలు నిర్వహించారు.

తల్లి పాలు అమృతంతో సమానం

కంచికచర్ల: తల్లి పాలు అమృతంతో సమానమని, నవజాత శిశువు ఆరోగ్యంగా పెరిగేందుకు తల్లి పాలు ఎంతో మేలు చేస్తాయని ఎంపీపీ షేక్ మలక్ బషీర్ పేర్కొన్నారు. తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో బుధవారం తల్లి పాల వారోత్సవాల కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. తల్లిపాలలో పలు రకాల పోషకాలుంటాయని చిన్నారుల్లో రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. పుట్టిన బిడ్డకు అరగంట లోపు తల్లిపాలు పట్టించాలన్నారు. అనంతరం గర్భిణులు, బాలింతలను ఆశీర్వదించారు. అనంతరం చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ వేల్పుల సునీత, ఎంపీటీసీ సభ్యులు బర్రె ఉదయ్‌కిరణ్, ఏపీఎం కోట భాస్కరరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తారాబీ, కరీమాబీ, అంగనవాడీ కార్యకర్తలు, గర్భిణు, బాలింతలు పాల్గొన్నారు. మండలంలోని గండేపల్లి, కీసర, పరిటాల, గొట్టుముక్కల, మోగులూరు తదితర గ్రామాల్లో ప్రపంచ తల్లి పాల వారోత్సవాలు నిర్వహించారు. గర్భిణు, బాలింతలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు సూచించారు.



కంచికచర్ల ర్యాలీలో పాల్గొన్న ఎంపీపీ మలక్‌బషీర్, సర్పంచ్ సునీత తదితరులు

మహిళపై దాడికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): మహిళపై దాడికి పాల్పడిన వ్యక్తిపై కొత్తపేట పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు చేపల మార్కెట్, శివాలయం ప్రాంతానికి చెందిన ఎండీ షేర్ బాను, షహీన్ షా భార్యభర్తలు. వీరికి ఇద్దరు కుమార్తెలు కాగా వారికి వివాహాలయ్యాయి. చిన్న అల్లుడు గౌస్, స్నేహితుడైన ఇంతియాజ్ ఇద్దరు కలిసి ఆన్‌లైన్‌లో వస్తువులు తెప్పించుకున్నారు. కొద్ది రోజులుగా ఇంతియాజ్ షేర్‌బాను ఇంటికివచ్చి గౌస్‌కోసం ఆరా తీస్తున్నాడు. అయితే ఇంతియాజ్ వచ్చిన సమయంలో గౌస్ ఇంట్లో ఉండటం లేదు. ఇదే విషయాన్ని చెబుతుండగా, మంగళవారం అదేవిధంగా ఇంటికి వచ్చి ఆరా తీశాడు. అయితే గౌస్ ఇంట్లో లేదని ఇంతియాజ్‌కు చెప్పడంతో ఆవేశంతో, కోపంతో షేర్‌బానుపై దాడి చేసి ఇష్టం వచ్చినట్లు కొట్టాడు. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

పింగళి వెంకయ్యకు నివాళి

పెనుగొలను(గంపలగూడెం): జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య జయంతిని గంపలగూడెం మండలం పెనుగొలనులో షిర్డీ సాయిబాబా సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. స్వాతంత్ర్య ఉద్యమంలో ఆయన సేవల్ని పలువురు కొనియాడారు. నాటి నేతలను ఆదర్శంగా తీసుకొని యువత పనిచేయాల్సి ఉందన్నారు. ఎలిమెంటరీ పాఠశాల హెచ్‌ఎం ఏవీ నరసింహారావు, గ్రంథాలయ నిర్వహణ అధికారి జ్యోతిర్మయి, గ్రామస్తులు పాల్గొన్నారు.


పేదల జీవన ప్రమాణాలు పెంచేందుకు చర్యలు

గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

వీరులపాడు: అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశ్వసనీయ, పారదర్శక పాలన అందించటంతో పాటు నిరుపేదల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నారని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. మండలంలోని వీరులపాడు గ్రామంలో బుధవారం ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా గ్రామంలోని ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించటంతో పాటు ప్రజా సంక్షేమ పథకాల క్యాలెండర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ దేశ చరిత్రలో ఏ రాష్ట్రంలో లేనన్ని సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టారన్నారు. అంతే కాకుండా సంక్షేమ పథకాల అమలులో సైతం పక్షపాత వైఖరి చూపకుండా అన్ని వర్గాలకు అర్హతే ప్రామాణికంగా అందిస్తున్నారని కొనియాడారు.

సంక్షేమ పథకాలతో ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు..

నిరుపేదలకు సంక్షేమ పథకాలు అందించి ఆర్థికాభివృద్ధికి తోడ్పాటునందిస్తున్నారని జగన్‌మోహనరావు చెప్పారు. ప్రజల కష్టాలు తెలిసిన వ్యక్తి ముఖ్యమంత్రిగా ఉంటే పాలన ఎలా ఉంటుందో రాష్ట్ర ప్రజలు ప్రత్యక్షంగా చూస్తున్నారన్నారు. ప్రజలకు నిరంతరం మంచి చేయాలనే తపనతో పని చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌కు రానున్న ఎన్నికల్లో అండగా నిలిచి పూర్తి మద్దతు పలకాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తి సౌజన్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ నువ్వుల విశ్వనాథం, నాయకులు శీలం లక్ష్మీప్రసన్న, మండూరి గోపి, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.



వీరులపాడులో ప్రభుత్వ పథకాల బ్రోచర్ అందజేసి నమస్కరిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

పోలీసు విధుల్లోనే కొనసాగించాలని వినతి

తిరువూరు: తమను మహిళా పోలీసు విధుల్లోనే కొనసాగించాలని కోరుతూ మండలంలోని సచివాలయాల ఎమ్మెస్కేలు బుధవారం ఎమ్మెల్యే రక్షణనిధికి విజ్ఞప్తి చేశారు. కోర్టు ఆదేశాల మేరకు మహిళా పోలీసు విధుల నుంచి తప్పించడంతో గ్రామస్థాయిలో ప్రజాసంక్షేమానికి తాము పూర్తిస్థాయిలో కృషి చేయలేకపోతున్నామని తెలిపారు. స్త్రీ శిశు సంక్షేమంతో పాటు మహిళా సంరక్షణకు పోలీసు శాఖకు అనుబంధంగా పనిచేసే అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం తగు నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఎమ్మెస్కేల రాష్ట్ర అసోసియేషన్ ఉపాధ్యక్షురాలు విజయలక్ష్మి, ఎన్టీఆర్ జిల్లా కోశాధికారి వరలక్ష్మి పాల్గొన్నారు.



తిరువూరు ఎమ్మెల్యే రక్షణనిధికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెస్కేలు